డబుల్ యాక్షన్ గ్యారంటీ

రామ్ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన పాన్ ఇండియా చిత్రం 'డబుల్ ఇస్మార్ట్' ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. 'ఇస్మార్ట్ శంకర్' మాస్‌ను మెప్పించడంతో ఈ సీక్వెల్‌పై ఇప్పటికే అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. తాజాగా ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. 'ఏ' సర్టిఫికెట్ లభించింది. ఇంటెన్స్ యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో చిత్రాన్ని తీర్చిదిద్దామని, ఓల్డ్‌సిటీ శంకర్‌గా హీరో రామ్ యాక్షన్ మరో స్థాయిలో ఉంటుందని, ఇంటర్వెల్ బ్యాంగ్‌తో పాటు క్లైమాక్స్ ఘట్టాలు ఎవరూ ఊహించని రీతిలో సాగుతాయని మేకర్స్ తెలిపారు. రామ్, కావ్యథాపర్ మధ్య రొమాంటిక్ కెమిస్ట్రీ స్పెషల్ అట్రాక్షన్‌గా ఉంటుందని, మణిశర్మ కంపోజ్ చేసిన పాటలు ఇప్పటికే పాపులర్ అయ్యాయని చిత్రబృందం పేర్కొంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నది. పూరి జగన్నాథ్, ఛార్మికౌర్ నిర్మించారు.

పుట్టిన ఊరుని మర్చిపోను

తాడూరు, ఆగస్టు 10 : తన గ్రామంలోని గుడి, బడిని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని 'కల్కి' సినిమా డైరెక్టర్ నాగ్ అశ్విన్ స్పష్టం చేశారు. నాగ్‌అశ్విన్ సొంతూరైన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఐతోల్ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తన సొంత నిధులు రూ.66 లక్షలతో నూతనంగా నిర్మించిన నాలుగు అదనపు తరగతి గదులను శనివారం కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ అశ్విన్ మాట్లాడుతూ పుట్టిన ఊరు, కన్న తల్లిని ఎప్పటికీ మరిచిపోనన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ కన్నతల్లితో సమానమైన సొంతూరికి ఉన్న బంధం పేగుబంధం వంటిదన్నారు. అనంతరం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న వయసులోనే 'కల్కి' సినిమాతో ప్రపంచ స్థాయికి ఎదిగిన నాగ్ అశ్విన్ మన జిల్లా వాసి కావడం గర్వించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ అశ్విన్ తల్లి జయంతిరెడ్డి, తండ్రి జయరాంరెడ్డితో పాటు పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అపజయం ఎరుగని యోధుడు

తమిళ అగ్ర హీరో సూర్య నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్ 'కంగువ' నిర్మాణం నుంచి దేశవ్యాప్తంగా ప్రేక్షకుల్లో ఆసక్తినిరేకెత్తిస్తున్నది. శివ దర్శకుడు. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలు, టీజర్ సినిమాపై మరింత అంచనాల్ని పెంచాయి. దసరా సందర్భంగా అక్టోబర్ 10న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ట్రైలర్‌ను ఈ నెల 12న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పాన్ వరల్డ్ మూవీగా పదిభాషల్లో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో హీరో సూర్య అపజయం ఎరుగని యుద్ధవీరుడిగా కనిపిస్తారని, ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు రానటువంటి వైవిధ్యమైన కాన్సెప్ట్, మేకింగ్‌తో ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రం త్రీడీలో కూడా విడుదలకానుంది. నైజాంలో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తున్నది. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిస్వామి, నిర్మాతలు: కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్, దర్శకత్వం: శివ.

స్నేహానికి మించిన శక్తి లేదు

'మ్యాడ్' చిత్రంతో మంచి గుర్తింపును తెచ్చుకున్నాడు ఎన్టీఆర్ బావమరిది, యువ హీరో నార్నె నితిన్. ఆయన తాజా చిత్రం 'ఆయ్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. అంజి కె మణిపుత్ర దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు. ఈ సందర్భంగా శనివారం హీరో నార్నె నితిన్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ సంగతులివి..

అల్లు అరవింద్‌గారి సలహా మేరకు ఈ సినిమాకు 'ఆయ్' అనే టైటిల్ పెట్టాం. గోదావరి యాసలో ఆయ్ అనే పదాన్ని ఎక్కువగా వాడుతుంటారు. గోదావరి నేపథ్య కథ కాబట్టి టైటిల్ బాగా కుదిరింది. స్నేహం ప్రధానంగా ఈ కథ నడుస్తుంది. కుల, మతాలకు అతీతంగా మనందరినీ ముందుకు నడిపించే గొప్ప శక్తి స్నేహానిదే అనే సందేశంతో ఆకట్టుకుంటుంది. కావాల్సినంత వినోదంతో పాటు ఎమోషనల్ ఎలిమెంట్స్ ఉంటాయి.

ఎన్టీఆర్ బాగుందన్నాడు

ఈ చిత్రంలో గోదావరి యాసలో మాట్లాడటం అంత ఇబ్బందిగా అనిపించలేదు. చిన్నతనం నుంచి గోదావరి ప్రాంతానికి చెందిన ఫ్రెండ్స్‌తో కలిసి ఉండటం వల్ల ఆ యాసలో పర్‌ఫెక్ట్‌గా మాట్లాడగలిగాను. ఎన్టీఆర్‌గారు ట్రైలర్ చూసి బాగుందని అన్నారు. ఆయనకు కామెడీ బాగా నచ్చింది. సినిమా చూసిన తర్వాత కూడా ఆయన హ్యాపీగా ఫీలవుతారని అనుకుంటున్నా.

హండ్రెడ్ పర్సంట్ ఎఫర్ట్స్

కెరీర్‌పరంగా ప్రత్యేకంగా ఎలాంటి ప్రణాళికలు వేసుకోలేదు. నా మనసుకు నచ్చిన కథలతో సినిమాలు చేస్తున్నా. ఎలాంటి కథ అయినా హండ్రెడ్‌పర్సంట్ ఎఫర్ట్స్ పెట్టాలన్నదే నటుడిగా నా లక్ష్యం. ప్రస్తుతం 'మ్యాడ్' సీక్వెల్ షూటింగ్ జరుగుతున్నది. ఈ ఏడాదిలోనే రిలీజ్ ఉండొచ్చు. ప్రస్తుతానికైతే కొత్త ప్రాజెక్ట్‌లు అంగీకరించలేదు.

నాగశౌర్య కొత్త చిత్రం

యువ హీరో నాగశౌర్య కొత్త చిత్రాన్ని ప్రకటించారు. రామ్ దేశిన దర్శకుడిగా పరిచయం కానున్న ఈ చిత్రాన్ని శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ పతాకంపై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మిస్తున్నారు. శనివారం రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నాగశౌర్య పాత్ర గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఉంటుందని, ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో రూపొందిస్తామని మేకర్స్ తెలిపారు. సముద్రఖని, రాజేంద్రప్రసాద్, సాయికుమార్, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, పృథ్వీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రసూల్ ఎల్లోర్, సంగీతం: హారిస్ జైరాజ్, రచన-దర్శకత్వం: రామ్ దేశిన (రమేష్).

రవితేజతో మరిన్ని సినిమాలు చేస్తాం

అనతికాలంలోనే తెలుగు సినీరంగంలో అగ్ర నిర్మాణ సంస్థగా ఎదిగింది పీపుల్ మీడియా ఫ్యాక్టరీ. ఇప్పుడీ సంస్థ లైనప్‌లో పదిహేను సినిమాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది దాదాపు పది చిత్రాలను తెరకెక్కించబోతున్నామని చెప్పారు పీపుల్ మీడియా సంస్థ సారథి, నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రవితేజ కథానాయకుడిగా హరీశ్‌శంకర్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా అగ్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ శనివారం పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్న విశేషాలు..

- రవితేజతో మా సంస్థకిది మూడో చిత్రం. ఇక ముందు కూడా ఆయనతో వరుస సినిమాలు చేస్తాం. రవితేజ-హరీశ్‌శంకర్ కాంబినేషన్‌కు మంచి క్రేజ్ ఉంది. 'మిస్టర్ బచ్చన్' చిత్రంలో యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్, ఫ్యామిలీ ఎమోషన్స్..ఇలా అన్ని అంశాలుంటాయి. ఇక యాక్షన్ ఎపిసోడ్స్ పరంగా 'ధమాకా' చిత్రానికి రెండింతలుగా ఉంటుంది.
- తొలుత ఈ చిత్రాన్ని ఆగస్ట్ 9న విడుదల చేద్దామని ప్లాన్ చేశాం. అయితే ఓ సాంగ్ బ్యాలన్స్‌గా ఉండటంతో డేట్ ప్రకటించలేదు. ఈలోగా 'పుష్ప-2' రిలీజ్ వాయిదా పడటంతో ఆ స్లాట్‌లో మా సినిమాను తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. లాంగ్‌వీకెండ్ మా సినిమాకు చాలా ప్లస్ అవుతుందని భావిస్తున్నాం.
- 'మిస్టర్ బచ్చన్' చిత్రాన్ని చాలా గ్రాండ్ స్కేల్‌లో తెరకెక్కించాం. అనుకున్న బడ్జెట్‌తోనే పూర్తిచేశాం. ఈ సినిమా పాటలన్నీ సూపర్‌హిట్ అయ్యాయి. దర్శకుడు హరీశ్‌శంకర్, మ్యూజిక్ డైరెక్టర్ మిక్కి జే మేయర్ మధ్య చక్కటి అవగాహన ఉండటంతో మ్యూజిక్‌పరంగా బెస్ట్ అవుట్‌పుట్ వచ్చింది.
- వంద సినిమాల టార్గెట్‌తో ఫ్యాక్టరీ మోడల్‌లో మా సంస్థను మొదలుపెట్టాం. ఆ ప్రయత్నాల్లో బిజీగా ఉన్నాం. ప్రస్తుతం 15 చిత్రాలు రిలీజ్‌కు సిద్ధంగా ఉన్నాయి. వచ్చే ఏడాది పది చిత్రాలు లైనప్‌లో ఉన్నాయి.
- ప్రభాస్‌తో మా సంస్థ చేస్తున్న ప్రెస్టిజియస్ ప్రాజెక్ట్ 'రాజాసాబ్' షూటింగ్ యాభై శాతం పూర్తయింది. ప్రస్తుతం జీ2, మిరాయ్, సన్నీడియోల్‌తో చేస్తున్న హిందీ సినిమా షూటింగ్స్ జరుగుతున్నాయి. కన్నడంలో మూడు చిత్రాలు చేస్తున్నాం. తెలుగులో ఐదు చిత్రాలు నిర్మాణంలో ఉన్నాయి. వీటితో పాటు అమెరికాలో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం. ఓటీటీ రిలీజ్‌కు ఐదు చిత్రాలు సిద్ధంగా ఉన్నాయి.

నాలుగేళ్ల కష్టానికి ఫలితం

'విడుదలైన అన్ని కేంద్రాల్లో 'కమిటీ కుర్రోళ్లు' చిత్రానికి అద్భుతమైన స్పందన లభిస్తున్నది. సినిమాలో చర్చించిన పాయింట్ అందరికి కనెక్ట్ అయింది. ఇలాంటి సినిమా తీసినందుకు చాలా గర్వంగా ఉంది' అని చెప్పింది నిహారిక కొణిదెల. ఆమె సమర్పణలో పింక్ ఎలిఫెంట్, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ పతాకాలపై యదువంశీ దర్శకత్వంలో రూపొందిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన విజయోత్సవ వేడుకలో నిహారిక కొణిదెల మాట్లాడుతూ 'ఈ కథ విన్నప్పుడు తప్పకుండా గొప్ప చిత్రమవుతుందనే నమ్మకం కలిగింది. కొత్తవారైనా నటీనటులందరూ అద్భుతంగా పర్‌ఫార్మ్ చేశారు' అని చెప్పింది. నాలుగేళ్ల కష్టానికి ఈ విజయంతో ప్రతిఫలం లభించిందని, సినిమాలో ప్రతీ పాత్రకు ఆడియెన్స్ కనెక్ట్ అవుతున్నారని, మూడు తరాలను తెరపై చూపించడం ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తున్నదని దర్శకుడు యదువంశీ అన్నారు. మంచి కంటెంట్‌కు లభించిన ఆదరణ ఇదని నిర్మాత జయ అడపాక పేర్కొంది. ఈ వేడుకలో చిత్ర యూనిట్ మొత్తం పాల్గొంది.

డీల్ కుదిరిందా?

స్వీయ దర్శకత్వంలో హను కోట్ల హీరోగా నటిస్తున్న చిత్రం 'ది డీల్'. పద్మా రమాకాంతరావు, రామకృష్ణ నిర్మాతలు. ఈ చిత్ర పోస్టర్స్‌ను రిటైర్డ్ ఐఏఎస్ కేవీ రమణాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. చిత్ర దర్శకుడు, హీరో హను కోట్ల మాట్లాడుతూ 'ఓ డిఫరెంట్ కాన్సెప్ట్‌తో సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: పి.సురేంద్రరెడ్డి, సంగీతం: ఆర్.ఆర్.ధృవన్.